## క్లుప్తంగా

### అన్నదానం



సీతారామస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

**వజ్రకరూరు:** మండల కేంద్రంలోని సీతారామ స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని అన్నదానం చేశారు. ఆలయంలో స్వామికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. గ్రామానికి చెందిన అచ్చనాల మనోహర్, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

### ఎయిడ్స్‌పై ప్రచార జాతా



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఉరవకొండ:** ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ప్రచార రథం ద్వారా ఆదివారం ఉరవకొండతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నియంత్రణ సంస్థ సభ్యులు కరపత్రాలు అందించి ఎయిడ్స్ వ్యాధి సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అనంతరం పలు గీతాలను ఆలపించి ప్రజలను చైతన్య పరిచారు. కార్యక్రమంలో ఎంసీఓ జయ ప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### బొమ్మనహాళ్‌లో వర్షం

**బొమ్మనహాళ్:** మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, ఉంతకల్లు, బండూరు, దేవగిరి, హరేసముద్రం, కురువల్లి, నేమకల్లు, శ్రీధరఘట్ట, కృష్ణాపురం, గోనేహాళ్, కొలగానహళ్లి, ఏలంజి గ్రామాల్లో ఆదివారం వర్షం కురిసింది. ఉంతకల్లు ఎన్టీఆర్ కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

**వజ్రకరూరు:** మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన వర్షం గంటకు పైగా కురిసింది. భారీ వర్షం కురవడంతో గ్రామంలోని కాలనీల్లోకి నీరు చేరింది. వర్షపునీరు మెయిన్‌రోడ్ మీదుగా చెట్టుకుంటవైపు పారింది. భారీ వర్షాలతో కుంటలు, బావులు, చెరువుల్లోకి నీరు చేరింది.

### ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలని ర్యాలీ




విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న హరిత దివ్యాంగుల సమితి సభ్యులు

**ఉరవకొండ:** స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహ విద్యార్థులతో కలిసి హరిత దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ర్యాలీ చేపట్టారు. స్థానిక ఎస్సీ సంక్షేమ వసతి గృహం వద్ద హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను లైసెన్సు రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు.

### రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఆర్థిక సాయం



చెక్కును ఆర్గనైజర్‌కు అందిస్తున్న దృశ్యం

**ఉరవకొండ:** స్థానిక ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా క్రీడా పోటీలకు తమ వంతుగా లయన్స్ క్లబ్ తరఫున రూ.5వేలు, క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రీజనల్ చైర్మన్లు సప్తగిరి మల్లికార్జున, టి.గణేష్‌బాబు, నాగేశ్వరావు చెక్కును ఆర్గనైజర్ మారుతీప్రసాద్‌కు అందించారు.

### అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ నబీరసూల్

**బొమ్మనహాళ్:** మండలంలో అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నబీరసూల్ అన్నారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుక, మట్టి తవ్వకాలు అనుమతి లేకుండా చేసే చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ రవాణా చేసేవారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఇసుక, మట్టి తరలించాలంటే సంబంధిత శాఖ అధికారులతో అనుమతి తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ తెలిపారు.


# తగ్గేదేలే.. తవ్వేస్తాం!



- హగరిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- పోటాపోటీగా డంప్‌లు ఏర్పాటు
- కేసులు నమోదవుతున్నా వెనక్కి తగ్గని అక్రమార్కులు



రాయదుర్గం పరిసరాల్లో ఇసుక డంప్



సిరిగేదొడ్డి సమీపంలో టీడీపీ నాయకుడు డంప్‌చేసిన ఇసుకను పరిశీలిస్తున్న సీఐ వెంకటరమణ (ఫైల్)

**రాయదుర్గం:** కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గంలో వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. వాగులు, వంకలు, చెరువుల్లోని ఇసుకను అక్రమంగా తరలించొద్దని చట్టం స్పష్టంగా చెపుతున్నా.. కొందరు ఖాతరు చేయడం లేదు. దనార్జనే ధ్యేయంగా ఈ దందా సాగిస్తున్నారు. కేసులు నమోదవుతున్నా వెనక్కి తగ్గకుండా అక్రమార్కులు ఇసుక రవాణా చేస్తున్నారు. పోటాపోటీగా డంప్‌లు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందనడానికి ఇటీవల రాయదుర్గం ప్రాంతంలో జరుగుతున్న ఘటనలే నిదర్శనం.

- గుమ్మఘట్ట మండలంలోని సిరిగేదొడ్డి– 75 వీరాపురం గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో టీడీపీ నాయకుడు ఇసుక డంప్ చేశాడు. అక్కడి నుంచి కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నాడు. ఈ సమాచారం అందుకున్న రూరల్ సీఐ వెంకటరమణ సిబ్బందితో కలసి ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. డంప్ చేసిన ఇసుక రాయదుర్గానికి చెందిన టీడీపీ నాయకుడు అశోక్‌దిగా గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ ఘటన జరిగి 24 గంటలు గడవక ముందే పట్టణ పరిసరాల్లో మరో ఇసుక డంప్ ఉన్నట్టు, అది మరో టీడీపీ నాయకుడిదై ఉంటుందని బీఎస్పీ నాయకుడు చిందనూరు నాగరాజు సామాజిక మాధ్యమంలో వైరల్ చేశారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేసేందుకు పోలీసులకు సవాలుగా మారింది.
- డి హీరేహాళ్ మండలం హిర్దేహాళ్ సమీపంలో ఇటీవల ఇసుక డంప్‌ను ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సీజ్ చేశారు. బాధ్యులపై కేసులు నమోదు చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా ప్రకృతి సంపద అక్రమార్కుల జేబులోకి చేరుతుందని ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.
- గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, డి హీరేహాళ్, కణేకల్లు, రాయదుర్గం మండలాల్లోని వేదావతి హగరి ఇందుకు వేదికగా మారింది. అధికారుల అనుమతులు లేకుండానే ఉచితం ఇసుక ముసుగులో ట్రాక్టర్లలో రోజంతా సరిహద్దుకు తరలించడం ఆపై చీకటి పడగానే జేసీబీల సాయంతో సరిహద్దులు దాటించడం పరిపాటిగా మారింది. పోలీసులు ఓ వైపు కేసులు నమోదు చేస్తున్నా లెక్కచేయకుండా పోటాపోటీగా డంప్‌లు చేసి, అక్రమంగా విక్రయిస్తున్నారు.

**ఎక్కడెక్కడ ఇసుక తరలిస్తారంటే?**

- డి హీరేహాళ్ మండలంలోని బాదనహాళ్, నాగలాపురం, తిమ్మలాపురం, డి హీరేహాళ్ హగరి, చెరువు ప్రాంతాల నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలించే ఇసుక సరిహద్దు ప్రాంతాల్లోని హిర్దేహాళ్, ఓబుళాపురం పరిసరాల్లో డంప్‌లుగా చేసి, రాత్రిళ్లు సరిహద్దులు దాటిస్తున్నారు.
- బొమ్మనహాళ్ మండలం లింగదహాళ్, ఏళంజి, బండూరు, కొలగారహాళ్లి, ఉద్దేహాళ్ వేదావతి హగరి నుంచి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు.
- కణేకల్లు మండలంలోని కోకూర్తి, బిదరకుంతం, మాల్యం తదితర ప్రాంతాల్లోని వేదావతి నది నుంచి ఎక్కువ భాగం ఇసుక అక్రమంగా ఉరవకొండకు తరలిపోతోంది.
- రాయదుర్గం మండలంలోని జుంజురంపల్లి, వేపరాళ్లక్రాస్ పరిసరాల్లోని ఇసుక అధిక భాగం పట్టణం వైపు వెళ్తోంది. దీన్ని పరిసరాల్లో డంప్ చేస్తున్నారు.
- గుమ్మఘట్ట మండలంలోని భూపసముద్రం, ఎర్రంపల్లి, రంగచేడు, కలుగోడు, వేపులపర్తి క్రాస్, గుమ్మఘట్ట ప్రాంతాల నుంచి ఇసుక ట్రాక్టర్లలో తరలిపోతోంది.

**ఎక్కడికి తరలిస్తారంటే?**

ఈ ప్రాంతాల్లోని ఇసుకను సరిహద్దు ప్రాంతాల్లో డంప్‌లుగా పేర్చి ఆ తర్వాత వాటిని రాత్రిళ్లు జేసీబీల సాయంతో టిప్పర్లకు లోడ్‌చేసి కర్ణాటక రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. డి హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు ప్రాంతాల్లోని ఇసుక బళ్లారి, సొండూరు, గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాల్లో సేకరించిన ఇసుక బెళ్లకెర, చిత్రదుర్గం, తుమకూరు, బెంగళూరు ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారు. ఒక్కో టిప్పర్ ఇసుక రూ.35 వేల నుంచి రూ.40 వేలకు పైగా విక్రయిస్తున్నారు.

**అడ్డుకట్ట పడేదెన్నడో..**

ఏకంగా 20 నుంచి 30 మీటర్ల లోతుకు ఇసుకను తోడేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయకపోతే రైతుల బతుకులు ఆగమ్యగోచరంగా మారనున్నాయి. అత్యల్ప వర్షపాత నమోదులో ఇప్పటికే జిల్లాతో పాటు రాయదుర్గం రెండో స్థానానికి పడిపోయింది. భూగర్భజలాలు కాపాడుకుంటేనే భవిష్యత్తులో తాగు, సాగు నీటి అవసరం కొంతవరకైనా తీరుతుందని నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికే హగరి పరీవాహక ప్రాంతాల్లోని సుమారు 20 గ్రామాల్లో బోర్లలో నీటి కష్టాలు, 10 గ్రామాల్లో తాగునీటి కష్టాలు వచ్చాయి.

**అక్రమార్కులపై ఉక్కుపాదం**

ఇసుక అక్రమ రవాణాపై పూర్తి నిఘా ఉంచాం. రెండు రోజుల క్రితం సమాచారం తెలియగానే సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నాం. ఎంతటి వారైనా సరే బాధ్యులపై వెనకడుగు వేయకుండా కేసులు నమోదు చేశాం. డి హీరేహాళ్ పరిధిలోనూ కేసులు పెట్టించాం. ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సరిహద్దు ప్రాంతాల్లోనూ నిఘా ఉంచాం. అనుమతి లేకుండా ఇసుక ట్రాక్టర్లు కనిపిస్తే సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తాం. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోనూ ఇసుక తరలించే వారిని పిలిపించి హెచ్చరించాం. పోలీసుల కళ్లు గప్పి ఇసుక తరలిస్తే జైలుకెళ్లక తప్పదు.

– వెంకటరమణ, సీఐ రాయదుర్గం


## నేడు తలారి రంగయ్య పర్యటన

**బ్రహ్మసముద్రం:** మండల పరిధిలోని ఎరడికెర, భైరసముద్రం , ముప్పటకుంట గ్రామాల్లో మాజీ ఎంపీ , వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య సోమవారం పర్యటిస్తున్నారు. గ్రామాల్లో నిర్వహించే బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. వైఎస్సార్ సీపీ బలో పేతానికి గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటు చేయనున్నారు. వైఎస్ఆర్‌సీపీ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు , కార్యకర్తలు హాజరు కావాలని పార్టీ మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

## దశభుజ మహా గణపతికి విశేష పూజలు

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనానికి స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి, మొక్కులు తీర్చుకున్నారు.

## వీరభద్ర స్వామికి అమావాస్య పూజలు



ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి



పూజలందుకున్న నేమకల్లు అంజన్న

**బొమ్మనహాళ్:** మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, హోమంలు, ఆకుపూజలు చేశారు. ఆలయ ప్రాగంణంలో అన్నదానం చేశారు. ప్రసద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు.

## నీలగిరిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**వజ్రకరూరు:** స్థానిక కురుబవీధిలోని నీలగిరిస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు ఆకుపూజ, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం,విశేషపూజలు, ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

## సబ్సిడీతో కుట్టు మిషన్ల పంపిణీ



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**బెళుగుప్ప:** వెంకటాద్రిపల్లి గ్రామంలో స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో ఇన్ఫిన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ ఇవ్వడంతో పాటు 50 శాతం సబ్సిడీతో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఐసీఎఫ్ సంస్థ చైర్మన్ విజయ్ కిశోర్ ఆధ్వర్యంలో 100 మంది మహిళలకు 50 శాతం సబ్సిడీతో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వాహకులు, వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా కిశోర్ చౌదరిని సన్మానించారు. కార్యక్రమంలో ఐసీఎఫ్ జిల్లా ప్రతినిధి సరస్వతి, స్థానికులు చల్లా రాజశేఖర్, ఐసీఎఫ్ సంస్థ డైరెక్టర్, నాయకులు సునీల్, వన్నూరస్వామి, పెద్ద ఎర్రిస్వామి, చల్లా కిరణ్ పాల్గొన్నారు.

## గురజాడ సేవలు చిరస్మరణీయం



గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు



గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేవీవీ నాయకులు

**కళ్యాణదుర్గం:** తెలుగు సాహిత్యంలో గురజాడ అప్పారావు సేవలు చిరస్మరణీయమని జేవీవీ, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు అన్నారు. గురజాడ వెంకట అప్పారావు జయంతి కార్యక్రమం విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగింది. జన విజ్ఞాన వేదిక, పెన్షనర్ల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జేవీవీ జిల్లా అధ్యక్షుడు చిత్తప్ప, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో కృష్ణయ్య చౌదరి, పాండురంగ, కృష్ణమూర్తి, విజయ్‌కుమార్, మారెన్న, ఇస్మాయిల్, ఫకృద్దీన్, రాజన్న, భగవాన్ దాస్, గంగప్ప, నరసింహులు, వీరభద్రయ్య, సోమశేఖర్, నాగరాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

**మహాకవి గురజాడ అప్పారావు జయంతి**

**రాయదుర్గంటౌన్:** స్థానిక ఏపీఎన్జీవో భవనంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం మహాకవి గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేవీవీ ప్రతినిధులు మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక మార్పునకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జేవీవీ అధ్యక్ష, కార్యదర్శులు శివానంద, నాగరాజు, గౌరవాధ్యక్షుడు వీరేష్, ఎన్జీవో అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## రైతుల డబ్బు ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల స్వాహా

**బ్రహ్మసముద్రం :** మండలంలోని కన్నేపల్లి రైతు సేవా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్ విద్యాసాగర్ సబ్సిడీ వేరుశనగ, ఎరువుల పేరిట రైతుల నుంచి డబ్బులు వసూలు చేసి, తిరిగివ్వలేదని బాధిత రైతులు వాపోతున్నారు. కన్నేపల్లికి చెందిన ఓ రైతు ఎరువుల బస్తాల కోసం అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు రూ. 45 వేలు చెల్లించాడు. కానీ ఎరువుల బస్తాలు ఇవ్వలేదు. అదే పంచాయతీలో ఓ రైతుకు సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు ఇస్తామని రూ.లక్షకు పైగా వసూలు చేశాడు. ఏఓ గోపాల్ తెలిపిన మేరకు.. ఏపీ సీడ్స్‌కు సంబంధించి 8.11 లక్షలు, మార్క్ ఫెడ్ రూ. 1,14,842 వాడుకున్నట్లు తెలిపారు. సామాజిక పింఛన్లకు సంబంధించి రూ.80 వేలు వాడుకున్నట్లు సమాచారం. కన్నేపల్లి రైతు సేవా కేంద్రం పరిధిలో రూ.11 లక్షలకు పైగా డబ్బులు స్వాహా చేసినట్లు రైతులు వాపోతున్నారు.

**డబ్బు వాడుకున్న వీహెచ్‌ఏ :** పడమటి కోడిపల్లి రైతు సేవా కేంద్రం వీహెచ్‌ఏ వరుణ్ కూడా ఇదే రీతిలో డబ్బులు తన సొంత పనులకు వాడుకున్నాడు. ఏపీ సీడ్స్ కంపెనీకి చెల్లించాల్సిన రూ.20,4732 వాడుకున్నాడు. వేరుశనగ విత్తన పంపిణీ సీజన్ అయిపోయినా సబ్సిడీ వేరుశనగ డబ్బులు ఏపీసీడ్స్ కంపెనీకి చెల్లించలేదని, వీరిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు అధికారులు తెలిపారు.

## నేటి నుంచి దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు



ఉరవకొండలో దసరా శరన్నవరాత్రులకు ముస్తాబైన ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయం



అలంకరణలో గుంతకల్లు రోడ్డు వద్ద వెలసిన జగదీశ్వరి అమ్మవారు

**ఉరవకొండ:** ఉరవకొండలో ప్రసిద్ధిగాంచిన ఉరగాద్రి చౌడేశ్వరీ, గుంతల్లు రోడ్డులో వెలసిన జగదీశ్వరీ అమ్మవారి ఆలయాలు శరన్నవరాత్రుల ఉత్సవాల కోసం ముస్తాబు అయ్యాయి. సిండికేట్ బ్యాంకు సమీపంలో ఉన్న ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. ఆలయ చైర్మన్ కొత్తశరత్ ఆధ్వర్యంలో గతంలో ఎన్నాడు లేని విధంగా ప్రత్యేకంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీంతో పాటు జగదీశ్వరి ఆలయంలో అమ్మవారి వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

**దేవీశరన్నవరాత్రులకు ముస్తాబైన ఆలయాలు**

**వజ్రకరూరు:** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. మండలంలోని అన్ని గ్రామాలో అమ్మవారి ఆలయాలు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. కొనకొండ్ల గ్రామంలో పెద్దమ్మ ఆలయం , వజ్రకరూరులోని లలితా త్రిపురసుందరీదేవి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు ఆలయాల్లో పూజలు జరుగుతాయని అర్చకుడు దత్తాత్రేయశర్మ ఆదివారం తెలిపారు.

## మానవత్వం చాటుకున్న ఎస్ఐ

**కళ్యాణదుర్గం రూరల్:** కంబదూరు ఎస్ఐ లోకేష్ మానవత్వం చాటుకున్నారు. కళ్యాణదుర్గం–పావగడ ప్రధాన రహదారి గుండా అండేపల్లి గ్రామం స్పీడ్ బ్రేకర్ వద్ద రోడ్డు గుంతలమయమై, నీరు నిలిచి ఉంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కంబదూరు ఎస్ఐ లోకేష్ ఆదివారం విధుల నిమిత్తం వెళ్తూ ఈ విషయాన్ని గమనించారు. వెంటనే కంకర మట్టిని గుంతలపై వేయించి, చదును చేయించారు. వాహన రాకపోకలు సజావుగా సాగుతుండటంతో ప్రజలు, వాహనదారులు ఎస్ఐ లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## వైఎస్సార్‌సీపీ నాయకులకు పరామర్శ



వైఎస్సార్‌సీపీ నాయకుడు చిక్కణ్ణను పరామర్శిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

**కణేకల్లు:** రోడ్డు ప్రమాదంలో గాయపడి కణేకల్లు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వార్డు మెంబర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు చిక్కణ్ణ, భార్య శారదలను వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పరామర్శించారు. ఆదివారం ఉదయం దంపతులిద్దరూ కణేకల్లు నుంచి బళ్లారికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అంబాపురం క్రాస్ వద్ద ఎదురుగా ద్విచక్ర వాహనంలో వస్తున్న ఓ వ్యక్తి ఢీ కొన్నాడు. ఈ ఘటనలో చిక్కణ్ణ, శారదకు గాయాలయ్యాయి. స్థానికులు వీరిని కణేకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెట్టు గోవిందరెడ్డి ఆసుపత్రికి చేరుకొని దంపతులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీవాణిజ్య విభాగం అధ్యక్షుడు ఆర్కేబద్రీ, జిల్లా పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ చిన్న సర్మస్, గోవులాపురం సర్పంచు ప్రకాష్‌చౌదరి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోకుర్తి జయరామిరెడ్డి, ఆలూరు చిక్కణ్ణ, పోరాళు శివ, బోర్‌వెల్ ఆనంద్‌రెడ్డి, మురడి మురళి, రామక్రిష్ణ, సుదర్శన్‌రెడ్డి, ఆదిసుద్గురు జయరామిరెడ్డి పాల్గొన్నారు.

**మాజీ ఎంపీటీసీకి పరామర్శ**

**డి హీరేహాళ్(రాయదుర్గం):** డి హీరేహాళ్ మండలంలోని మలపనగుడి మాజీ ఎంపీటీసీ గవిసిద్ధ, అతని తండ్రి మారెప్ప ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్స అనంతరం గ్రామానికి చేరుకున్నారు. విషయం తెలియగానే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మెట్టు విశ్వనాథ్‌రెడ్డి మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, బూత్‌కన్వీనర్ అంజిరెడ్డి లతో కలసి ఆదివారం గ్రామానికి చేరుకుని వారిని పరామర్శించారు. నాయకులు శర్మాస్‌వలి, సింగాడి మంజునాథ, కల్యం చిత్రయ్య, ఈశ్వర్‌గౌడ, హరిజన తిప్పేస్వామి, అంజినప్ప, దుర్గేష్, మల్లికార్జునరెడ్డి, జగదీష్ నాయక్, రమేష్‌నాయక్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వాస్పత్రిలో భద్రతపై బెంగ



ఇంజక్షన్ వేసే గదిలో గోడ నెర్రెలు బారిన వైనం



కట్టుకట్టే గదిలో లెంటల్ లెవల్‌లో చీలికలు

- నెర్రెలుబారిన గోడలు.. ఎక్కడబడితే అక్కడ పగుళ్లు
- ఎనిమిదేళ్లకే బయటపడిన ప్రభుత్వాస్పత్రి భవనం డొల్లతనం

**కణేకల్లు:** కణేకల్లు ప్రభుత్వాస్పత్రి భవనానికి ఎక్కడబడితే అక్కడ పగుళ్లు, చీలికలొచ్చాయి. కొత్త భవనం రోజురోజుకూ నెర్రెలు బారుతుండడంతో రోగులు, ఆస్పత్రి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. కనీసం ఐదు దశాబ్దాల పాటు అయినా పదిలంగా ఉండాల్సిన ఆస్పత్రి భవనం కొన్నేళ్లకే పగలొచ్చి శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి వచ్చింది. డిసెంబర్ 5వతేదీ వస్తే... ఈ భవనం ప్రారంభించి సరిగ్గా ఎనిమిదేళ్లవుతోంది. కణేకల్లు సామాజిక ఆరోగ్య కేంద్రానికి పాత భవనాలు, చాలీచాలని గదులు ఉండడంతో అప్పట్లో టీడీపీ ప్రభుత్వం కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.2.25 కోట్లు (2 కోట్లా 25 లక్షలు)తో ఆస్పత్రి భవనాన్ని నిర్మించారు. 2017 డిసెంబర్ 2 అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు ఈ భవనాన్ని ప్రారంభించారు.ఈ పనులను చేపట్టిన కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలను ఏమాత్రం పాటించకుండా నాసిరకం పనులు చేపట్టారు. నాసిరకం పనులతో ఆస్పత్రి భవనానికి అర్ధాయుష్షే! అంటూ 'సాక్షి' కథనాలను రాసింది. పేద ప్రజలకు వైద్యం అందజేసే వైద్యశాలను నిబంధనలనుసరించి పనులు చేయలేదు. అయితే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో కాంట్రాక్టర్ తన స్వలాభం కోసం సిమెంటును తక్కువగా వినియోగించి భవనాన్ని నిర్మించేశాడు. ఓ వైపు సిమెంటు తక్కువగా వినియోగించడం.. మరో వైపు వాటర్ క్యూరింగ్ సరిగా చేయకపోవడంతో భవన నిర్మాణంలో నాణ్యత లోపించింది. దాని పర్యవసానమే గోడలకు నెర్రెలు చీలాయని ప్రజలు అంటున్నారు.

**అప్పట్లో మేలుకోని ఇంజనీరింగ్ అధికారులు:**

ఆసుపత్రిలో దాదాపు అన్ని గదుల పరిస్థితి ఒకేలా ఉంది. ఏ గోడలు చూసినా చీలిపోతూ దర్శనిమిస్తున్నాయి. దీని బాధ్యులెవరని ప్రజలడిగే ప్రశ్నకు అధికారులే సమాధానం చెప్పాలి. 5 దశాబ్దాల పాటు పదిలంగా ఉండాల్సిన ఆస్పత్రి భవనం నాసిరకం పనులతో ఒక దశాబ్దానికే దుస్థితికి చేరుకునేలా ఉందని ప్రజలు అంటున్నారు. భవన నిర్మాణ సమయంలో అధికారులు జాగ్రత్త పడి ఉంటే ఆసుపత్రి భవనానికి ఈ పరిస్థితి వచ్చేది కాదని ప్రజలంటున్నారు.

## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి



పీసీ ప్యాపిలి బస్టాండ్ వద్ద స్పీడ్ బ్రేకర్లు లేని దృశ్యం

**వజ్రకరూరు:** మండలంలోని పీసీ ప్యాపిలి బస్టాండ్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. పీసీ ప్యాపిలి బస్టాండ్ వద్ద ఉరవకొండ–గుంతకల్లు ప్రదాన రహదారి ఉండటంతో నిత్యం పెద్ద సంఖ్యలో వాహన రాకపోకలు సాగిస్తుంటాయి. ఈసమయంలో వాహనదారులు ఏమాత్రం ఆదమరచినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు, స్థానికులు అంటున్నారు.

## వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



నక్కల నాగరాజు (ఫైల్)

**బెళుగుప్ప:** మండల పరిధిలోని కాలువపల్లికి చెందిన ఈడిగ నక్కల నాగరాజు (55) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. నాగరాజు మృతదేహానికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాల వేసి, నివాళులర్పించారు. నాగరాజు మృతి పార్టీకి తీరనిలోటని నాయకులు అన్నారు. మృతుడికి భార్య పద్మావతి, కుమారుడు వరప్రసాద్, కూతురు వైష్ణవి ఉన్నారు.

## చెట్లు నరికివేత

**బ్రహ్మసముద్రం :** మండల కేంద్రంలోని నంజాపురం రోడ్డులోని ఎస్సీ కమ్యూనిటీ భవనం (పాత పోలీస్‌స్టేషన్ ) ఎదుట ఉన్న భారీ చెట్లను నరికేశారు. అటవీ అధికారులు, మండల అధికారులు చెట్లు నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కాలవ తిప్పేస్వామి తదితరులు కోరుతున్నారు.